



శ్రీకాకుళంలో కురుస్తున్న చిరుజల్లులు

అంతటా చిరుజల్లులు

శ్రీకాకుళం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారింది. ఆ ప్రభావంతో శుక్రవారం జిల్లా అంతటా చిరుజల్లులు కురిశాయి. రణస్థలంలో 18.75 మిల్లీమీటర్లు, లావేరులో 17, జి.సిగడాంలో 11.25, గారలో 11, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పొందూరు ప్రాంతాల్లో 10.5 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. తీరప్రాంతంలో ఈదురుగాలుల ధాటికి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మరోవైపు రైతులు వరిపంటను భద్రపరిచేందుకు అవస్థలు పడ్డారు. కొద్దిపాటి వర్షానికే పొలాల్లో వరికుప్పలు తడిసిపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

తడిచిన వరిపనలు

- నీరు బయటకు మళ్లించేందుకు పాట్లు
- ధాన్యం రాశులను కాపాడేందుకు ఇక్కట్లు
- తుఫాన్ ప్రభావంతో జిల్లాలో వర్షాలు
- నష్టం తప్పదంటున్న రైతులు



కంచిలి: కోసిన వరిపంటను ట్రాక్టర్‌పైకి ఎక్కిస్తున్న రైతులు

నరసన్నపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పొలాల్లో వరిపనలు తడిచి ముద్దకాగా.. పంట కుప్పల కిందకు నీరు చేరింది. ఇక రోడ్లు, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం కాపాడుకునేందుకు రైతులు ఇక్కట్లు పడుతున్నారు. తడి ధాన్యం మీద టార్పాన్లు వేయడంతో రంగు మారుతాయన్న ఆందోళనలో ఉన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 4.50లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. దాదాపు 80శాతం వరికోతలు కాగా.. వ్యవసాయ అధికారులు లెక్కల ప్రకారం 50శాతం మేరకు పొలాల్లో కుప్పలు పెట్టగా.. 35వేల మెట్రిక్ టన్నులు కల్లాల్లో ఉన్నాయి. మరో 30వేల ఎకరాల్లో వరిపనలు పొలాల్లో ఉన్నాయి.



జి.సిగడాం: ధాన్యాన్ని బస్తాల్లో భద్రం చేస్తున్న రైతులు

నరసన్నపేట, పోలాకి, జలుమూరు, గార, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, సారవకోట, ఎల్‌ఎన్‌పేట, సరుబుజ్జిలి, శ్రీకాకుళం రూరల్, హిరమండలం మండలాల్లో కోతలు పూర్తయి పొలాల్లోనే వరిపనలు ఉన్నాయి. కొన్నిచోట్ల వరిపనల కిందకు నీరు చేరడంతో బయటకు మళ్లించేందుకు అవస్థలు పడుతున్నారు.

ఇంకా రెండురోజులు వర్షాలు

తుఫాన్ ప్రభావంతో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తేమ శాతం 17 నుంచి 24 వరకు ఉన్నా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. తడిసిన ధాన్యం కొనుగోలుపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఆదివారం వరకు వర్షాలు పడితే ధాన్యం రంగు మారుతుందని ఆందోళన చెందుతున్నారు.

- ఎల్.ఎన్.పేట: చింతలబడవంజ, డొంకలబడవంజ, కొత్తపేట, కవిటి, పూశాం, రావిచెంద్రి, ధనుకువాడ, కోవిలాం, చిట్టిమండలం, తురకపేట, క్రిష్ణాపురం తదితర గ్రామాల్లో ధాన్యం రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికందివచ్చిన పంటను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వరిచేలు కుప్పలపై గడ్డివేసి కప్పటమే కాకుండా టార్పాలిన్లు వేస్తున్నారు.
- జి.సిగడాం: మధ్యాహ్నం నుంచి చిరుజల్లులుతో వర్షం పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోసిన పంటను దిబ్బలుగా వేశారు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని బస్తాలకు పట్టి (మిగతా 6వ పేజీలో..)



గార : బందరువానిపేట వద్ద..

ముందుకొచ్చిన సముద్రం

గార, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా బందరువానిపేట వద్ద సముద్రం సుమారు 20 మీటర్లు ముందుకు రావడంతో ఒడ్డున ఉన్న పడవలు, వలలు మునిగిపోయాయి. అధికారులు హెచ్చరికలతో ముందే మత్స్యకారులు వాటిని సురక్షిత ప్రదేశంలో భద్రపరిచినా శుక్రవారం ఉదయం సముద్రపు అలలు ఎగిసిపడి ముందుకురావడంతో అవి మునిగిపోయాయి.



నరసన్నపేట: సంతపేట వద్ద వర్షపునీటిలో వరిపనలు



ఇచ్ఛాపురం: హాస్టల్‌లో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు

అరకొర 'వసతి'

- హాస్టళ్లల్లో మౌలిక సౌకర్యాలు కరువు
- సరిపడా గదులు, మరుగుదొడ్లు లేక అవస్థలు
- తాగునీటి కోసం విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

ఆంధ్రజ్యోతి విజిట్

పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వసతిగృహాల్లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. కనీసస్థాయిలో మౌలిక వసతులు లేక విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో చాలాచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని భవనాల్లో గదులకు కిటికీలు.. తలుపులు లేవు. విద్యార్థులకు సరిపడా మరుగదొడ్లు, స్నానపు గదులు లేవు. దీంతో విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే చాలాచోట్ల మంచాలు లేక.. సరిపడా దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో నేలపైనే నిద్రిస్తూ.. చలికి గజగజ వణికిపోతున్నారు. 6లో



శ్రీకాకుళం: బీసీ బాలుర వసతిగృహంలో ఒకేచోట వసతి, రీడింగ్ గది

ఒక్కటీ.. లేదు

- మంజూరు 195.. పూర్తయినవి సున్నా
- ఇదీ డిజిటల్ గ్రంథాలయాల పరిస్థితి
- వైసీపీ సర్కారు నిర్వాకం తీరిది
- పెదవి విరుస్తున్న ప్రజలు

- గ్రంథాలయ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకు రానున్నట్టు గత వైసీపీ ప్రభుత్వం చెప్పింది. ప్రతి గ్రామంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఉమ్మడి జిల్లాకు తొలి విడతగా 195 డిజిటల్ గ్రంథాలయ భవనాలు మంజూరు చేసింది. ఒక్కో భవనానికి రూ.16లక్షలు చొప్పున నిధులు కేటాయించింది. కానీ ఇప్పటివరకూ ఒక్క భవన నిర్మాణం కూడా పూర్తికాని దుస్థితి నెలకొంది.
- ఇచ్ఛాపురం మునిసిపాల్టీలో తొమ్మిది డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తామని గతంలో అధికారులు ప్రకటించారు. స్థలాల సేకరణ పేరిట హడావుడి చేశారు. కానీ ఒక్కచోట కూడా పనులు ప్రారంభించలేదు. కనీసం పునాది నిర్మాణం కూడా చేపట్టలేదు. ఒక్క ఇచ్ఛాపురంలోనే కాదు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి.



మెళియాపుట్టి మండలం దీనబంధుపురంలో డిజిటల్ గ్రంథాలయం నిర్మాణం ఇలా..

ఇచ్ఛాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణం ప్రకటనలకే పరిమితమైంది. వైసీపీ హయాంలో జిల్లావ్యాప్తంగా 195 డిజిటల్ గ్రంథాలయాలు మంజూరు చేశారు. ఒక్కో భవన నిర్మాణానికి ఉపాధి హామీ నిధులను రూ.16లక్షలు కేటాయించారు. పంచాయతీ రాజ్ శాఖకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. తొలి విడతగా 2022 ఉగాదికి, రెండో విడత అదే ఏడాది డిసెంబరుకు, మూడో విడత 2023 మార్చి నాటికి నిర్మాణాలు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. కానీ ఒక్కచోట కూడా నిర్మాణం పూర్తికాలేదు. 22 చోట్ల వివిధ నిర్మాణ దశల్లో పనులు ఉన్నాయి. మిగతా వాటికి సంబంధించి మాత్రం ఎటువంటి పురోగతి లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ గ్రంథాలయాలు అంతే..

ప్రభుత్వ గ్రంథాలయాలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం వాటికి భవనాలు కూడా నిర్మించలేదు. పురాతన శిథిల భవనాలు, ఇరుకు గదుల్లో పాఠకులు అసౌకర్యానికి గురవుతున్నారు. పాతకాలం నాటి పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, కొన్ని దినపత్రికలు, మ్యాగజైన్లతో నెట్టుకొస్తున్నారు. దీనికితోడు గ్రంథాలయాల నిర్వహణకు తగినంత మంది సిబ్బంది లేరు. కానీ జగన్ సర్కారు మాత్రం పంచాయతీకొక డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేయాలని భావించింది. మండలానికి ఒకటి చొప్పున ఉన్న గ్రంథాలయాన్ని నిర్వహించలేకపోతున్న తరుణంలో పంచాయతీకి (మిగతా 6వ పేజీలో..)

సమాచారం

బైపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్ బైపీసీ స్ట్రీమ్‌లో పరీక్ష రాసి అర్హత సాధించిన అభ్యర్థుల అడ్మిషన్ల షెడ్యూల్ విడుదలైందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం) ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ జి.దామోదర రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'బీటెక్ బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్, బీ-ఫార్మసీ, ఫార్మా-డీ కోర్సుల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఈ ప్రక్రియ ఈ నెల 30న ప్రారంభమై వచ్చే నెల 14 వరకు కొనసాగుతుంది. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 5వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లోనే ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకుని సర్టిఫికెట్ల పరిశీలన చేయించాలి. ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే హెల్ప్‌లైన్ కేంద్రాన్ని వచ్చే 2 నుంచి 6లోగా సంప్రదించాలి. వచ్చే నెల 3 నుంచి 7 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ జరుగుతుంది. 8న వెబ్‌ఆప్షన్ల నమోదులో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. వచ్చే నెల 11న సీట్ల కేటాయింపు వివరాలు ప్రకటిస్తారు. 11 నుంచి 14వ తేదీలోగా ఆయా కళాశాలల్లో రిపోర్ట్ కావాలి' అని దామోదరరావు సూచించారు.

48 గంటలకు ముందే..

- రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు జమ
- అన్నదాతల్లో హర్షం



- మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన ఉర్లాన వెంకటస్వామి అనే రైతు గురువారం ధాన్యం విక్రయించగా.. శుక్రవారం ఆయన బ్యాంకు ఖాతాలో నగదు జమైంది. గతేడాది ధాన్యం విక్రయించిన రెండు నెలలు తర్వాత ఆయన ఖాతాలో డబ్బులు పడ్డాయి. ఈ ఏడాది మాత్రం తనకు నచ్చిన మిల్లుకు ధాన్యం పంపించగా.. 48 గంటలు కాకముందే డబ్బులు జమకావటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.



'మర్రిపాడు-సి'లోని రైతు సేవా కేంద్రంలో షెడ్యూల్..



- మెళియాపుట్టి మండలం జలగలింగుపురం గ్రామానికి చెందిన రాణా మహాలక్ష్మికి గతేడాది ధాన్యం విక్రయించేందుకు.. సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న గొప్పిలి మిల్లుకు ఇవ్వాలని అధికారులు తెలిపారు. కానీ ఈ ఏడాది మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చాపర మిల్లుకు ధాన్యం విక్రయించేందుకు అవకాశం కల్పించడంతో ఆమె హర్షం వ్యక్తం చేస్తోంది.

మెళియాపుట్టి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం విక్రయాలకు రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. సుదూరంలో ఉన్న మిల్లులకు ఆపసోపాలు పడి ధాన్యం తరలించి విక్రయించినా.. సకాలంలో వారి బ్యాంకు ఖాతాలో నగదు జమయ్యేది కాదు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలు తెలుసుకుని.. వారు నచ్చిన మిల్లుకు ధాన్యం విక్రయించుకునేలా అవకాశం కల్పించింది. దీంతోపాటు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోపే వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 4,47,382 ఎకరాల్లో వరి సాగుచేశారు. జిల్లాలో 412 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని, 570 రైస్‌మిల్లుల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వారి బ్యాంకు ఖాతాల్లో 48 గంటల్లోనే నగదు జమచేయాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. శుక్రవారం కొంతమంది రైతుల ఖాతాలో నగదు కూడా జమచేసేశారు. కాగా గతంలో మిల్లర్లు బస్తాకు నాలుగైదు కేజీలు ధాన్యం అదనంగా తీసుకునేవారని, ఈ ఏడాది ఆ పరిస్థితి లేకుండా అధికారులు చర్యలు చేపట్టడం హర్షణీయమని తెలిపారు.

రాత్రయినా తీసుకుంటున్నారు..

శుక్రవారం చిరుజల్లులు పడడంతో ధాన్యం ఎక్కడ నిల్వ చేయాలో తెలియక భయపడ్డాం. కానీ రాత్రయినా సరే షెడ్యూల్ ఇవ్వటంతో ధాన్యం పంపించాం. కూటమి ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం.

-చలపతి, జలగలింగుపురం

మాట నిలబెట్టుకున్నారు..

కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ధాన్యం డబ్బులు సకాలంలో జమ చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం రైతుల డబ్బులు దారి మళ్లించింది. ఆరు నెలలు తరువాత జమ చేసింది. మంత్రి అచ్చెన్నాయుడు కృషితో ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

-ఉర్లాన వసంత్, టీడీపీ నాయకుడు, మెళియాపుట్టి

అరకొర వసతి

ఆంధ్రజ్యోతి విజిట్

- హాస్టళ్లల్లో మౌలిక సౌకర్యాలు కరువు
- సరిపడా గదులు, మరుగుదొడ్లు లేక అవస్థలు
- తాగునీటి కోసం పాట్లు ● విద్యార్థులకు తప్పని ఇబ్బందులు


శ్రీకాకుళం హాస్టల్‌లో ఆరుబయటే స్నానాలు చేస్తున్న బాలురు


శ్రీకాకుళం బాలుర హాస్టల్‌లో మంచాలు లేక కిందనే ఇలా..


గార: వసతి గృహంలో కిటికీలకు తలుపు లేని దృశ్యం


టెక్కలి: ఎస్సీ బాలుర వసతిగృహంలో కిటికీ ఇలా..


ఎల్.ఎన్.పేట: శిథిలావస్థకు చేరిన వంటగదికి తాళం


ఇచ్ఛాపురం : మూలకు చేరిన మంచాలు..


నందిగాం: ఒకే చాపపై ఇరుకిరుకుగా చదువులు

గుజరాతీపేట/ ఇచ్ఛాపురం/ గార/, టెక్కలి/ నరసన్నపేట/ నందిగాం/ ఎల్.ఎన్.పేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రభుత్వ వసతిగృహాల్లో అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో వసతిగృహాలో పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా.. చాలా చోట్ల శిథిల భవనాలు, విరిగిపోయిన కిటికీ తలుపులు దర్శనమిచ్చాయి. సరిపడా గదులు, మంచాలు లేక విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. శ్రీకాకుళంలో బాలురు కళాశాల విద్యార్థులకు సంబంధించిన నాలుగు వసతిగృహాల్లో మౌలిక వసతుల కొరత వెంటాడుతోంది. సరిపడా భవనాలు లేక ఒకే గదిలో వసతితోపాటు రీడింగ్ రూమ్‌ను వినియోగించుకుంటున్నారు. వరండాలో స్టడీఅవర్స్ నిర్వహిస్తున్నారు. బాత్‌రూమ్‌లు చాలక ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. ఆ ప్రదేశం చుట్టుపక్కల ఖాళీస్థలం కావడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. అలాగే మంచాలు లేక విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు.

● చలికి బిక్కుబిక్కుమని..

ఇచ్ఛాపురం మునిసిపాల్టీ పరిధిలోని రెండు వసతిగృహాల్లో విద్యార్థులు చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బెల్లుపడ కాలనీలోని బీసీ వసతి గృహంలో 36 మంది, కొళిగాంలోని బాలుర వసతిగృహంలో 65 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికీ ఒక్కో దుప్పటి ఇచ్చారు. కానీ కింద వేసుకునేందుకు కార్పెట్ (జంబుకానా) ఇవ్వలేదు. మంచాలు పాడై మూలకు చేరాయి. దీంతో విద్యార్థులు గచ్చుపైనే పడుకుంటున్నారు. ప్రభుత్వం త్వరలో కార్పెట్‌లు పంపిణీ చేయనుందని వార్డెన్‌లు రవికుమార్, కాంతారావు తెలిపారు. అలాగే నందిగాం బీసీ వసతిగృహంలో ఆరు నుంచి పదోతరగతి వరకూ 35 మంది విద్యార్థులు ఉన్నారు. మంచాలు లేక వీరంతా నేలపైనే చాపలపై నిద్రిస్తూ చలికి బిక్కుబిక్కుమంటున్నారు.


నరసన్నపేట: బాలుర వసతిగృహంలో ఇసుక కుప్ప పక్కనే భోజనం చేస్తున్న విద్యార్థులు

● గదులు, మురుగుదొడ్లు చాలక..

నరసన్నపేటలోని బాలికలు, బాలురు వసతి గృహాలు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. బాలికల వసతిగృహంలో సుమారు 250 మంది విద్యార్థినులు ఉండగా కేవలం ఆరు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. కొన్ని సమయాల్లో నీటి కొరత కారణంగా.. విద్యార్థినులు వీధి కుళాయిల నుంచి నీటిని తీసుకెళ్లి స్నానాలకు వినియోగిస్తున్నారు. భోజనాలు రుచిగా ఉండడం లేని విద్యార్థినులు తెలిపారు. గదుల కొరత కారణంగా ఒకే చోట 50 నుంచి 60 మంది నిద్రిస్తున్నామన్నారు. అలాగే బాలుర వసతిగృహంలో భోజనశాల వద్ద ఇసుక కుప్పలు దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వం కన్నా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని నిర్వాహకులు చెబుతున్నా.. అద్దె భవనాల్లో గదులు చాలక విద్యార్థులు సర్దుకుపోతున్నారు. బాత్‌రూమ్‌లు చాలక ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. కిటికీలకు మెస్‌లు లేకపోవడంతో దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు.

కిటికీలకు మెస్‌ల్లేవు..

గార వసతిగృహంలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. వసతి భవనం కిటీలకు తలుపులు విరిగిపోగా, మెస్‌ల్లేవు. దీంతో చలికి విద్యార్థులు వణికిపోతున్నారు. నాలుగేళ్ల నుంచి ట్రంకు పెట్టెలు ఇవ్వపోవడంతో విద్యార్థుల పుస్తకాలు ఆరుబయటే ఉంటున్నాయి. అలాగే టెక్కలిలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో మూడు నుంచి పదో తరగతి వరకు 44మంది విద్యార్థులు ఉన్నారు. ఒక గదికి కిటికీ తలుపులు చెదలు పట్టి.. ఊడిపోయాయి. దీంతో విద్యార్థులు రాత్రివేళ చలికి తట్టుకోలేక అవస్థలు పడుతున్నారు.

● తాగునీటికి ఇక్కట్లు..

లక్ష్మీనర్సుపేటలోని ఎస్సీ బాలుర సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో 65 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా తాగునీటి వసతి లేక అవస్థలు పడుతున్నారు. ఇక్కడ మోటారు పాడై సుమారు 8 నెలలు అయినా ఇంతవరకూ బాగుచేయలేదు. వంశధార నీటిని ప్రజలకు అందించేందుకు ఎల్.ఎన్.పేట వద్ద మెగా రక్షితనీటి పథకాన్ని నిర్మించారు. పైపులైన్ ద్వారా ఈ నీటిని బాలుర వసతిగృహానికి కూడా సరఫరా చేస్తున్నారు. రక్షితనీటి పథకం పాడైతే.. తమకు నీటికి ఇబ్బందులు తప్పవని విద్యార్థులు వాపోతున్నారు. వంట గది, భోజనాల గది పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. సరిపడా మరుగుదొడ్లు కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని విచారం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

పొడుగుపాడు వద్ద తారసపడిన పులి

- ఏడాదికోసారి పరిపాటే.. ● అటవీ శాఖ అధికారుల స్పష్టత ● అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన


పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కోటబొమ్మాళి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలంలో బుధవారం పులి సంచరించి ఆవును చంపేసిన ఘటన మరువకముందే శుక్రవారం తెల్లవారు జామున కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు గ్రామ సమీపంలో హైవే దాటుతూ 108 వాహన సిబ్బందికి తారస పడింది. దీనిని చూసిన సిబ్బంది భయభ్రాంతులకు గురై సైరన్ వేయడంతో ఒక్కసారి పరుగు లంఘించుకుని సమీపంలోని పొలాల్లోకి వెళ్లిపోయింది.. 108 వాహన సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంతబొమ్మాళి మండలం నుంచి ఒక రోగిని శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించి తిరిగి వస్తుండగా పొడుగుపాడు వద్ద జాతీయ రహదారిని దాటుతూ పులి కనిపించింది. దీనిని చూసిన 108 సిబ్బంది ఒక్కసారి ఆందోళనకు గురై భయభ్రాంతులు చెంది 108 వాహన సైరన్ మోగించారు. దీంతో పులి వేగంగా పక్కన ఉన్న పొలాల్లోకి వెళ్లిపోయిందని పైలెట్ ఉప్పాడ అప్పలనాయుడు తెలిపారు. వెంటనే అప్రమత్తమై పరిసర ప్రాంతాల్లోని మిత్రులను అప్రమత్తం చేస్తూ అటవీశాఖాధి కారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఉదయం ఎఫ్ఆర్వో జగదీశ్వర రావు తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని పులి పాదముద్రలను పరిశీలించారు.

గతేడాది వచ్చిన పులి పాదముద్రలే..

ఎఫ్ఆర్వో జగదీశ్వరరావు మాట్లాడుతూ.. పులి సంచరించడం వాస్తవమని, దీని పాద ముద్రలు, గతేడాది సంచరించిన పులి పాదముద్రలు, కొలతలకు పరిశీలించామని, అదే పులి మరలా ఇప్పుడు కూడా ఈ ప్రాంతానికి వచ్చినట్లు నిర్ధారించుకున్నామన్నారు. ఏడాదికోసారి పులి టెక్కలి, మెళియాపుట్టి, సంతబొమ్మాళి మండలాల్లో పర్యటించడం పరిపాటిగా మారిందని, ఈ ఏడాది కోటబొమ్మాళి మండలంలో కూడా ప్రవేశించిందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా పులి తారసపడితే తమకు సమాచారం అందించాలని సూచించారు. పరిశీలనలో ఎఫ్ఎస్‌వోలు కృష్ణారావు, నరేంద్ర, పినకాన జాన్సి, జనప్రియ, రజింత్ కుమార్, ఏబీవో జీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సమాచారాన్ని ఎస్ఐ, తహసీల్దార్‌కు అందజేసినట్లు తెలిపారు.

చూసిన వెంటనే హడలిపోయాం..



తాము పొడుగుపాడు గ్రామం వద్దకు వచ్చే సరికి ఒక్కసారి పులి రోడ్డును దాటుకుంటూ కనిపించింది. దీంతో ఒక్కసారి హడలిపోయాం. మేము సంతబొమ్మాళి మండలానికి చెందిన రోగిని శ్రీకాకుళంలో ఆసుపత్రిలో దింపి తిరిగి వస్తుండగా రాత్రి ఒంటిగంట సమయంలో పులి తారస పడింది. ఏం చేయాలో తోచక ఒక్కసారి సైరన్ మోగించా. దీంతో ఆ పులి పొలాల్లోకి పరుగు తీసింది. వెంటనే గ్రామాల్లోని తెలిసిన వ్యక్తులకు, అటవీశాఖాధికారులకు సమాచారం ఇచ్చాం.

-అప్పలనాయుడు, పైలెట్, 108

షరామామూలే..!

- మొరాయించిన సీటీస్కాన్
- జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రోగులకు తప్పని తిప్పలు

టెక్కలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో గడచిన నాలుగు రోజులుగా సీటీ స్కాన్ మొరాయించడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. రోజుకి 30 నుంచి 40 మంది వరకు రోగులకు సీటీ స్కాన్ సేవలు అందిస్తుండగా సాంకేతిక సమస్యతో ఈనెల 26 నుంచి యంత్రం పని చేయడం లేదు. గతంలో విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గుల కారణంతో అనేక పర్యాయాలు అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో సీటీ స్కాన్ సేవలకు ప్రత్యేకంగా జనరేటర్‌ను ఏర్పాటు చేయడంతో ఆ సమస్య తప్పింది. ఇప్పుడు సీటీ స్కాన్ యంత్రంలో ట్యూబ్ కాలిపోవడంతో నాలుగు రోజులుగా ఈ యంత్రం మూలకు చేరడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీటీస్కాన్‌కు మరమ్మతులు చేపట్టా సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.


టెక్కలిలో మొరాయించిన సీటీస్కాన్ యంత్రం


టెక్కలి: వరికుప్పలపై కప్పిన టార్పాలిన్లు


పలాస రూరల్: దానగొరలో వరికుప్పలు పెడుతూ..


జలుమూరు: ధాన్యం బస్తాలను ఇంటికి తరలిస్తున్న రైతులు

తడిచిన వరిపనలు

(ఐదో పేజీ తరువాయి)

షెడ్‌లలో భద్రపరచటంతో పాటు మిల్లులకు పంపించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

● **టెక్కలి:** ఫంగల్ తుఫాన్ రైతుల్ని వణికిస్తోంది. శుక్రవారం రోజంతా చిరుజల్లులు కురవడంతో పంటను చివరిదశలో రక్షించుకునేందుకు పొలాల్లో పడిగాపులు కాశారు. కొందరు నూర్చిన ధాన్యాన్ని పోగులు చేశారు. మరికొందరు కుప్పలపై తార్పాన్లు కప్పారు. తీరప్రాంతవాసులకు అప్రమత్తం చేసినట్లు ఆర్డీవో ఎం.క్రిష్ణమూర్తి అన్నారు. ఇప్పటికే సంతబొమ్మాళి మండలంలో మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా ఉండేందుకు దండోరా వేయించామని తెలిపారు. అలాగే మండల, సబ్‌కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

● **కంచిలి:** ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి ఇప్పటివరకు పది శాతం మాత్రమే కోతలు జరిగినట్లు వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. కంచిలి మండలంలోని 126 ఎకరాలు, ఇచ్ఛాపురంలో 98 ఎకరాలు, సోంపేటలో 186 ఎకరాలు, కవిటి మండలంలో 10ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తయినట్లు తెలిపారు. వరి కోతలు పూర్తయిన చోట పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

● **జలుమూరు:** మండలంలో శుక్రవారం చిరుజల్లులు పడడంతో ధాన్యాన్ని భద్రపరచుకోడానికి రైతులు కష్టాలు పడుతున్నారు. పంట చేతికందే సమయంలో వర్షాలు పడుతుండడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

● **పలాస రూరల్:** ఈదురుగాలులతో పాటు చిన్నపాటి చినుకులు పడడంతో పలాస మండల రైతులు పంటచేనును కుప్పలుగా ఎత్తి వాటిపై టార్పాన్లు కప్పారు. రెంటికోట, అల్లుకోల, కాంట్రగడ, లొత్తూరు, దానగొర, హిమగిరి, కైజోల, కొత్తూరుతో పాటు ఉద్దాన ప్రాంతాల్లో రైతులు వరి పంటను రక్షణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

● **పోలాకి:** ఉదయం వాతావరణం పొడిగా ఉండడంతో వరి చేలను ఇంటికి, కల్లానికి తెచ్చేపనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వాతావరణం పూర్తిగా మారిపోయింది. వెంటనే వర్షం కురవడంతో ఎక్కడిపనులు అక్కడ నిలిపివేశారు. పొలాల్లోనే వరికుప్పలుపెట్టి టార్పాన్లు కప్పారు. వర్షం ఎడతెరిపిలేకుండా కురుస్తూనే ఉంది.


పోలాకి : ఈదురుగాలులకు నేలకొరిగిన వరిచేను


ఎల్.ఎన్.పేట: చింతలబడవంజ సమీపంలో..


నందిగాం : రౌతుపురంలో..

ఒక్కటీ.. లేదు

(ఐదో పేజీ తరువాయి)

ఒకటి నిర్వహణ సాధ్యమేనా అన్న విమర్శలు వ్యక్తమయ్యాయి.

● అరకొరగానే సిబ్బంది..

జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో 90 వరకూ శాఖా గ్రంథాలయాలున్నాయి. కొన్నిచోట్ల విలేజ్ గ్రంథాలయాలున్నాయి. బుక్ డిపోజిట్, డెలివరీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. సిబ్బంది కొరత, ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రంథాలయాలు సమస్యలతో కొట్టిమిట్టాడుతున్నాయి. ఇప్పటికీ చాలా గ్రంథాలయాలు శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల ప్రభుత్వ శాఖలు వినియోగించకుండా ఉంచిన భవనాల్లోనే నడుస్తున్నాయి. సిబ్బంది కొరత కూడా అధికంగా ఉంది. శాఖ గ్రంథాలయాలను పర్యవేక్షిస్తున్న లైబ్రేరియన్లంతా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. కొంతమంది పదవీ విరమణ చేస్తున్నా.. కొత్తగా నియామకాలు చేపట్టడం లేదు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబబందిని సైతం నియమించడం లేదు. దీంతో ఉన్న సిబ్బందితో ఎలాగోలా నెట్టుకొస్తున్నారు.

● జిల్లాలో కొన్ని గ్రంథాలయాల్లో ఇంటర్‌నెట్ సేవలు మూన్నాళ్ల ముచ్చగానే మిగిలింది. సాంకేతిక సమస్యలతో సేవలు నిలిచిపోయాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ కేవలం రాజకీయ నిరుద్యోగులకు వేదిక అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. కీలకమైన పదవి దక్కించుకునేందుకు నేతలు పోటీ పడుతుంటారు. కానీ కొన్నేళ్లుగా గ్రంథాలయాలకు ఎటువంటి నిధులు లేకుండా పోతున్నాయి. బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయిస్తుండడంతో సేవలు మెరుగుపడడం లేదు. గ్రంథాలయాధికారుల ప్రతిపాదనలకు సైతం మోక్షం కలగడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరరముంది.

● వైసీపీ ప్రభుత్వం విఫలం..

ఇచ్ఛాపురంలో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటవుతుందని ఆశించాం. కానీ గ్రంథాలయం ఏర్పాటులో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఉన్న గ్రంథాలయాలను సైతం గాలికొదిలేసింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. గ్రంథాలయాల నిర్వహణను మెరుగుపరచి పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలను అందుబాటులోకి తేవాలి.

-సాలిన జగదీష్ యాదవ్, నిరుద్యోగ యువకుడు, ఇచ్ఛాపురం

● మెరుగుపరచాలి

గ్రంథాలయాల సేవలను మరింత మెరుగుపరచాలి. డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తామని చెప్పడంతో ఎంతో ఆశపడ్డాం. కానీ కనీస స్థాయిలో కూడా అడుగులు ముందుకు పడలేదు. గ్రంథాలయాలను అభివృద్ధి చేసి..ఇంటర్నెట్ సేవలు, పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో తేవాలి.

-కృష్ణచంద్రపూరి, నిరుద్యోగ యువకుడు, ఇచ్ఛాపురం

11న గీతా జయంతి పోటీలు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ కాలనీలో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గీతా జయంతి పోటీలు వచ్చే నెల 11న నిర్వహించనున్నట్టు మిమిక్రీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 94410 72762, 77948 01289 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు మున్సిపల్ సమావేశం

ఇచ్ఛాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో శనివారం 11 గంటలకు సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ రాజలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో రావాలని, కౌన్సిల్ హాజరు కావాలని కోరారు.

7న యాగమహోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సంతోషిమాత ఆలయంలో ఈ నెల 7 నుంచి యాగమహోత్సవ పూజలు నిర్వహిస్తున్నట్టు అర్చకులు కిరణ్‌శర్మ తెలిపారు.



సర్వజన ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తా

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. తొలుత ఆసుపత్రిలో తాగునీటికి ఏర్పాటు చేసిన ఫ్రిజ్‌లు, లిఫ్ట్‌లను పరిశీలించారు. అవిసరిగా పనిచేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం సమీక్షించారు. ఆసుపత్రికి సంబంధించిన సమస్యలు, అవసరాలపై సమగ్ర నివేదిక తయారుచేసి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ దానరి షకీలా, రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవి వెంకటాచలం, ఇతర ఆసుపత్రి అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే బలగలోని నాలుగు డివిజన్ల పరిధిలో జరుగుతున్న రోడ్లు మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. అలాగే విశాఖ-ఎ కాలనీ పరిధి ఏడో లైను ఆర్టీసీ కాలనీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.



రిమ్స్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

రుద్రాభిషేకాలు



తుల్జాభవానీ ఆయలంలో సామూహిక రుద్రాభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బొందిలీపురంలోని తుల్జాభవానీ ఆయలంలో శుక్రవారం సామూహిక రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఉన్న శివలింగానికి క్షీరాభిషేక, పంచామృతాభిషేకం నిర్వహించారు. ● ఉమాజీవేశ్వరాలయంలో శుక్రవారం 1100 కలశాలతో ఆలయ శిఖరాన మహాకుంబాభిషేకం నిర్వహించారు. ● పెద్ద బరాటంవారి వీధిలో ఉన్న నీలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రకాల పండ్లు, పూలతో అలంకరణ నిర్వహించారు.

● సరుబుజ్జిలి: షలంత్రిలో గల నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి అన్న సంతర్పణ నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

విజనున్న పాలకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా విజనున్న పాలకుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ జాబ్‌మేళాలో 185 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ ఉరిటి సాయికుమార్, స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోపి, ఎంపీటీసీ గొర్లె సూర్యం, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

సరుబుజ్జిలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్సీని కోరారు. హెచ్‌ఎం కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

జి.సిగడాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణాల్లో నాణ్యతా పాటించాలని డ్వామా పీడీ బి.సుధాకర్ అన్నారు. శుక్రవారం వాండ్రంగి గ్రామంలో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో జి.రామకృష్ణ, పీఆర్‌జేఈ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

కంచిలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన చేపట్టాలని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి ఎస్.తవిటినాయిడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. వెనుకబడిన విద్యార్థులకు కావాల్సిన స్టడీ మెటీరియల్ ప్రభుత్వమే అందిస్తుందన్నారు. అధ్యాపకులకు స్టడీ అవర్స్ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాత్రి గస్తీ పరిశీలన

శ్రీకాకుళం క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో గస్తీ విధులు పకడ్బందీగా నిర్వహించాలని, అనుమానం ఉన్న ప్రతి వ్యక్తిని, వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీసు అధికారులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. గురువారం అర్ధరాత్రి దాటాక రిమ్స్ ఔట్ పోస్టును, పాలకొండ రోడ్డు, కృష్ణా పార్కు సమీపంలో పోలీసుల గస్తీ తనిఖీ చేశారు. తరచూ లాడ్జీలు తనిఖీ చేయాలని, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు.

కాలినడకన రామతీర్థానికి అయ్యప్పస్వామి భక్తులు



బయలుదేరిన అయ్యప్ప స్వామి మాలధారులు

రణస్థలం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నారువ గ్రామానికి చెందిన నిద్రబంగి రామకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో 20 మంది అయ్యప్ప స్వాములు, భవానీ భక్తులు శుక్రవారం కాలి నడకన రామతీర్థం బయలుదేరి వెళ్లారు. శనివారం సీతా శ్రీరాములను దర్శించుకుంటామని తెలిపారు.

రెండు వేల మంది మహిళలకు చీరల పంపిణీ



మహిళలను సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు

ఇచ్ఛాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త వీఎస్ఎం ఫౌండేషన్ చైర్మన్ వజ్రపు వెంకటేష్ శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని రెండు వేల మంది వితంతువులను సత్కరించి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్, స్థానికులు వెంకటేష్, అనూష, జాన్‌వికాస్, రమ్యశ్రీ, శంకర్‌లక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సమీక్ష

సోంపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు అధికారులను సిద్ధం చేసినట్టు తహసీల్దార్ బి.అప్పలస్వామి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రెండు, మూడు రోజులు కోతలు చేపట్టకుండా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు చేపడతామని తెలిపారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

అరసవల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలపై భారం మోపే స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమించాలని వామపక్ష నాయకులు బి.కృష్ణమూర్తి, తాండ్ర అరుణ, చిక్కాల గోవిందరావు పిలుపునిచ్చారు. 'ప్రజలపై విద్యుత్తు భారాలు వేయొద్దు' అనే అంశంపై ఎన్‌జీవో హోమ్‌లో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

విద్యార్థుల సందర్శన

లావేరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం జడ్పీ స్కూల్లో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సమీపంలో గల పత్తికాయవలస శీతలపానీయాల తయారీ పరిశ్రమను శుక్రవారం సందర్శించారు. వృత్తి విద్య చదువుతున్న విద్యార్థులు విజిట్‌లో భాగంగా ఈ సందర్శన చేపట్టినట్టు హెచ్‌ఎం అరుణ కుమారి తెలిపారు.

రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) సురంగిరాజా మైదానాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రస్తుతం రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం సురంగి రాజా మైదానాన్ని పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఇండోర్ స్టేడియం నిర్మాణంతో పాటు ఆట పరికరాలు సమకూరుస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ దానరి రాజు, టీడీపీ నాయకులు కొండా శంకర్‌రెడ్డి, కాళ్ల దిలీప్, లీలారాణి, విశ్వనాథం పాల్గొన్నారు. కాగా విప్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారి ఇచ్ఛాపురం వచ్చిన ఎమ్మెల్యేను పట్టణానికి చెందిన ఎలియన్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు.


ఆక్రమణలు తొలగించండి

సురంగి రాజా మైదానం ఆక్రమణలకు గురైనట్టు నా దృష్టికి వచ్చిందని, వెంటనే సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ వెంకటరావు, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌ను ఎమ్మెల్యే అశోక్ ఆదేశించారు. మైదానానికి ఆనించి ఉన్న గృహాల వాడుక నీరు పైపులను తొలగించాలన్నారు.


● కవిటి: కె.కొత్తూరు గ్రామంలోని గారమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొన్నారు. టీడీపీ నాయకులు బి.రమేష్, పి.కృష్ణారావు, బి.తిరుమలరావు, ఎ.మధు, ఎ.రాజు, వి.రంగారావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లొద్దపుట్టి ఫీడర్ పరిధిలోని విద్యుత్ పనులు నిమిత్తం జర్నలిస్ట్ కాలనీ, ఈదుపురం ఐస్ ప్లాంట్ వద్ద, లొద్దపుట్టి పంచాయతీలో సరఫరా నిలిపి వేయనున్నట్టు ఈఈ విఘ్నేశ్వర రావు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.









క్రైం కార్నర్

ప్రజా ఫిర్యాదులపై తక్షణం చర్యలు: ఎస్పీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

పలాస, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ హౌస్ అధికారులు తక్షణం స్పందించి బాధితులకు ఊరట కలిగేలా చర్యలు తీసుకో వాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులపై చట్టపరమైన విచారణ నిర్వహించాలన్నారు. ఫిర్యాదుదారుల నుంచి నేరుగా సమస్యలను అడిగి తెలుసు కున్నారు. 20 ఫిర్యాదులు అందగా వాటిలో కుటుంబ కలహాలు, ఆస్తి, కొట్లాట, మిస్సింగ్ కేసులతో పాటు ఇతర ఫిర్యా దులున్నాయి.

దారికాచి.. దోపిడీయత్నం

● చాకచక్యంగా తప్పించుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్


దాడి నుంచి తప్పించుకున్న విష్ణు

ఎచ్చెర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎస్ఎంపురం గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ పైల విష్ణు పింఛన్ డబ్బులు తీసుకు వెళ్తుండగా.. ఆ గ్రామ రోడ్‌లో ఇద్దరు వ్యక్తులు దారికాచి దోపిడికి విఫల యత్నం చేశారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఎస్ఎం పురం గ్రామ పంచాయతీలో సామాజిక పింఛన్లు శనివారం పంపిణీ చేసేందుకు ఎచ్చెర్లలోని ఎస్‌బీఐలో రూ.24,60,000 నగదు విత్ డ్రా చేశారు. ఆ డబ్బులు ఓ సంచిలో పెట్టుకుని మధ్యాహ్నం 3.40 గంటల సమయంలో మోటారు బైక్‌పై విష్ణు సచివాలయానికి ట్రిపుల్ ఐటీ రోడ్‌లో వెళ్తుం డగా.. అనమిత్ర టౌన్‌షిప్‌కు సమీపంలో 25 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మోటారు బైక్‌తో వెనుక నుంచి వచ్చి దాడి చేశారు. దీనిని గమనించిన విష్ణు ఒక్క ఉదుటున తన వాహన వేగాన్ని పెంచి ముందుకు దూసుకుపోయాడు. అయినప్పటికీ దుండగలు కూడా అంతే వేగంతో దూసుకువచ్చి విష్ణు కుడి చేతిపై ఇనుప రాడ్‌తో కొట్టారు. అయినా విష్ణు ముందుకుసాగగా.. సమీపంలో గొర్రెల కాపర్లు కనిపించారు. దీంతో ఆ దుండగులు బైక్‌తో వెనుకదిరిగి వెళ్లిపోయారు. వెల్ఫేర్ అసిస్టెంట్ విష్ణు బ్యాంకు నుంచి డబ్బులు విత్‌డ్రా చేసి ఎస్ఎం పురం రోడ్‌లో వస్తున్నట్టు కదలికలను గమనించిన వ్యక్తులు.. ఈ దాడికి పాల్పడినట్టు భావిస్తున్నారు. ఈ ప్రాంతంతో అనుబంధం ఉన్న వ్యక్తులే ఈ పని చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు వెల్ఫేర్ అసిస్టెంట్ విష్ణు ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వి.సందీప్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ రోడ్‌లో గల సీసీ కెమెరాల్లో ఏమైనా రికార్డు అయి ఉంటుందేమోనని ఆరా తీస్తున్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

నరసన్నపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేవాది గ్రామం వద్ద శుక్రవారం రాత్రి బరాయినిపేట చెరువు గట్టుపై పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.85,100 నగదు, రెండు కార్లు, 5 ద్విచక్ర వాహనాలు, 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

గ్యాస్ లీకై మహిళకు గాయాలు

కొత్తూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడుం కాలనీలో శుక్రవారం గ్యాస్ లీకై ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కడుం కాలనీకి చెందిన పెద పొందర కమలమ్మ చిన్న కుమారుడు శివ ఇంటికి గురువారం రాత్రి భోజనానికి వెళ్లి తిరిగి తన ఇంటికి వచ్చి తాగేందుకు వేడినీరు కాచుకున్న అనంతరం గ్యాస్ స్టవ్‌ను ఆపడం మరిచిపోయింది. శుక్రవారం తెల్లవారు జామున లేచి లైట్ వేయగా అప్పటికే లీక్ అయిన గ్యాస్ చుట్టూ వ్యాపించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఆ మంటలు ఆమెకు అంటుకోవడంతో స్థానికులు మంటలు ఆర్పారు. వెంటనే ఆమెను 108లో కొత్తూరు సామాజిక ఆసుపత్రికి తరలించగా.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ ఎం.డి.అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఎంఈవో మృతి

పోలాకి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఎంఈవో యారబాటి వాసుదేవరావు (72) ఆకస్మికంగా శుక్రవారం మృతిచెందారు. స్వగ్రామం వెదుళ్లవలస. వాసుదేవరావు ప్రతిరోజు వాకింగ్‌కు వెళతారు. ఈ నేపథ్యంలో సంతలక్ష్మీపురం వద్ద వాకింగ్‌కు వెళుతుండగా వాహనం ఢీకొని బలమైన గాయపడ్డారు. వెంటనే ఉన్నత వైద్యం కోసం శ్రీకాకుళం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన మృతికి పలువురు నేతలు, గ్రామస్థులు సంతాపం తెలిపారు.

కొత్తమ్మతల్లి ఆలయ ఆదాయం రూ.5.37 లక్షలు

కోటబొమ్మాళి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తమ్మతల్లి ఆలయానికి 56 రోజులకు రూ.537907 ఆదాయం వచ్చినట్లు ఈవో వి.రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం హుండీలను తెరిచి లెక్కించారు. ఆమదాలవలస గ్రూప్ దేవాలయాల ఈవో టి.రవి పర్యవేక్షించారు. సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఒడిశా

గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

పర్లాకిమిడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుమ్మా సమితిలో బిజూ జనతా దళ్ పార్టీ ఆధ్వర్యంలో బంధు మిళిత (స్నేహపూర్వక) సమావేశం శుక్రవారం నిర్వహిం చారు. ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతి, పర్లాకిమిడి మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలాశెట్టి, గుమ్మా, గుసాని సమితుల చైర్మన్లు సునేమిమండల్, వీర్రాజు, మాజీ ఎమ్మెల్యే కె.సూర్యారావు షైటెక్ సంస్థల అధ్యక్షుడు తిరుపతి పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు కొత్త కళ

పర్లాకిమిడి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలకు కొత్త కళ తీసుకొచ్చేందుకు సెక్టార్ హేబిటేషన్ పేరుతో హౌసింగ్ ప్రాజెక్టు రూపొందించినట్లు సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు డాక్టర్ డీఎన్ రావు తెలిపారు. ఈ మేరకు ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఫౌండేషన్, సెంచూరియన్ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. గజపతి జిల్లాలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన గయలజుల, అలజోలా రషికరాజ్‌పూర్ గ్రామాల్లో దాదాపు 3 వేల మందికి ఇళ్ల ద్వారా ప్రయోజనం అందుతుందన్నారు. ఆయా గ్రామాల్లో మొదటి విడతగా 80 ఇళ్లు నిర్మించ నున్నట్లు తెలిపారు. ఎల్‌టీఐ మైండ్ ట్రీ చీఫ్‌సెషన్‌బిలిటీ ఆఫీసర్ ఫణీస్ రౌత్ర మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు కమ్యూనిటీలకు సాధికారిత కల్పించడంలో నిబద్ధతను ప్రతిబింబిస్తుందని, గిరిజనుల్లో నైపుణ్యం పెంపొందించి ప్రభుత్వ మద్దతుతో సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అనితా పాత్రో, సుప్రియపట్నాయక్ పాల్గొన్నారు.


ఎల్‌టీఐ మైండ్ ట్రీ సౌజన్యంతో ఒప్పందం కుదుర్చుకున్న సెంచూరియన్ విశ్వవిద్యాలయం ప్రతినిధులు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ





శ్రీకాకుళం, పాతపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న సమితి ప్రతినిధులు

అరసవల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానం నుంచి ఆర్‌అండ్‌బీ బంగ్లా వరకు కొనసాగింది. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేయగా సమితి గౌరవ సలహాదారు కళ్లేపల్లి రామ్‌గోపాల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, రాష్ట్రపతి ఈ తీర్పును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వర్గీకరణకు మద్దతు పలికిన ఏ రాజకీయ పార్టీకైనా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పోరాట సమితి కన్వీనర్ తైక్వాండో శ్రీను, కో కన్వీనర్ కంఠ వేణు, ప్రతినిధులు బడే కామరాజు, రాయి వేణు గోపాల్, బోనెల రమేష్ తదితరులు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఎస్ఎన్ మూర్తి, మల్లెల వెంకటరావు, మంచె నాగమల్లేశ్వరి, బొడ్డేపల్లి నర్సింహులు, పాత్రేటి పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ గెస్ట్‌హౌస్ నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ సాగింది. అక్కడ మానవహార నిర్వహించి వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కోర్టుకూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘం పాతపట్నం మండల అధ్యక్షుడు తొగిరి లక్ష్మీనారాయణ, సిర్ల జోగారావు, నవగాన రత్న కుమార్, యజ్జల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన

శ్రీకాకుళం రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాగోలులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్మీకంపోస్టు ఉత్పత్తి దశలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ప్రజలు దగ్గరుండి తడి, పొడి చెత్తను క్రమం తప్పకుండా కలెక్షన్ చేయాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవో, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక రుద్రాభిషేకం

జలుమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. కార్తీకమాసం మాస శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని పురోహితులు అక్కాజోష్యుల రాజశేఖర శర్మ నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా గణపతి పూజ, పుణ్యావహచనం, మండపారాధన, రుద్రాభిషేకం పూజలు చేపట్టారు.

● పలాస, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సీతారామాలయంలో శుక్రవారం సామూహిక సహస్ర లింగార్చన కన్నుల పండువగా చేపట్టారు. ప్రతి ఏటా సహస్రలింగార్చన నిర్వహించడం ఆనవాయితీ. 1001 లింగాలకు శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకం నిర్వహించారు. కార్యదర్శి జీజేఎస్.రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కలమటను కలిసిన సుడా చైర్మన్

కొత్తూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుడా చైర్మన్‌గా నియమితులైన జనసేన నేత కొరికాన రవికుమార్ శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మూర్తిని మాతలలో మర్యాద పూర్వకంగా కలిశారు. జనసేన నాయకుడు గేదెల చైతన్య తదితరులున్నారు.

'గ్రామసభ నిర్వహించకుండా నిర్ణయమా?'

హరిపురం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహించకుండా, ప్రజా మోదం లేకుండా ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించడం దారుణమని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ, వివిధ ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మందస మండలం ఎయిర్‌పోర్టు నిర్మాణ గ్రామాలైన రాంపురం, గంగువాడ, బిడిమి గ్రామాల్లో ఆయా సంఘాల నాయకులు వీవీ రమణమూర్తి, పోతనపల్లి కుసుమ, అరుణ, ధనలక్ష్మి తదితరులు రైతులను కలిసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో చిరంజీవి, దున్న రామారావు, బత్తిని లక్ష్మణ్, దున్న హరికృష్ణ, పురుషోత్తం పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

పలాసరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీటీపీసీపీ చైర్మన్ వజ్జ బాబూరావు, మాజీ ఎంపీపీ దువ్వాడ కృష్ణమూర్తి నాయుడు అన్నారు. లక్ష్మీపురంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ్‌కుమార్, నాయకుడు దువ్వాడ సంతోష్ కుమార్, ఏడీఏ మధు, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, బీజేపీ కార్యదర్శి సిస్టు మురళి, కొనుగోలు కేంద్రం మేనేజర్ శ్రీనివాస్, పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వం తీసుకున్న రామారావు

పాతపట్నం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రొంపివలస గ్రామానికి చెందిన ఆర్మీ విశ్రాంత ఉద్యోగి పిట్ట రామారావు రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం స్వీకరించారు. సభ్యత్వాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యేతో పాటు పలువురు నేత లు అభినందించారు. కార్యక్రమంలో తెలుగుయువత ప్రధాన కార్యదర్శి బుద్ధల నరేష్, యెరుకోల కృష్ణారావు. రావాడ సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కృష్ణదాస్ పీఏకు రిమాండ్

శ్రీకాకుళం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో పట్టుబడిన మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ పీఏ గొండు మురళీకి విశాఖ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. గురువారం ఏసీబీ అధికారులు ఆరు చోట్ల తనిఖీలు నిర్వహించి కోట్లాది రూపాయలు ఆస్తులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని.. శుక్రవారం విశాఖలో ఏసీబీ కోర్టుకు తరలించారు. వచ్చే నెల 12 వరకు రిమాండ్ విధించడంతో విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు.

కళింగపట్నం-శ్రీకాకుళం రోడ్డుకు నిధులు

శ్రీకాకుళం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గార మండలం కళింగపట్నం నుంచి శ్రీకాకుళం వరకు రోడ్డు విస్తరణ చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రోడ్డు విస్తరణకు గాను రూ.9.88 కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌అండ్‌బీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు విడుదల చేశారు.

నలుగురు డిప్యూటీ కలెక్టర్‌లకు పోస్టింగ్‌లు

శ్రీకాకుళం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విధులు నిర్వహించి వెయిటింగ్‌లో ఉన్న నలుగురు డిప్యూటీ కలెక్టర్‌లకు పోస్టింగ్‌లు లభించాయి. డిప్యూటీ కలెక్టర్ వేణుగోపాల్‌ను కాకినాడలో సమగ్రశిక్షకు ఏసీపీగా నియమించారు. సుధాసాగర్‌ను విశాఖలో హెచ్‌పీ సీఎల్ భూ సేకరణ విభాగానికి, ఇదివరకు శ్రీకాకుళం ఆర్డీవోగా విధులు నిర్వహించిన రంగయ్యను గుంటూరు జిల్లా విజిలెన్స్ విభాగంలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సోషల్ వెల్ఫేర్ లో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న కె.వినాయకంను శ్రీకాకుళం ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నియమించారు.

'ప్రసాద్' పథకంలో అరసవల్లిని ఎంపిక చేయాలి


కేంద్రమంత్రి షెకావత్‌తో కేంద్ర మంత్రి రామ్మోహన్, ఇతర ఎంపీలు

అరసవల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ సూర్య దేవాలయం అరసవల్లి మాస్టర్ ప్లాన్ అమలు, అభివృద్ధిలో భాగంగా ఆలయాన్ని 'ప్రసాద్' పథకంలో ఎంపిక చేయాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకా వత్‌ను కోరారు. టీడీపీ ఎంపీలు ఎం.శ్రీభరత్(విశాఖ), హరీష్ బాలయోగి (అమలాపురం), నాగరాజు (కర్నూల్), డి.ప్రసాదరావు (చిత్తూరు)తో కలిసి శుక్రవారం ఢిల్లీలో షెకావత్‌ను కలుసుకున్నారు. రూ.100 కోట్లతో ఆలయ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనను ఈ సందర్భంగా మంత్రికి అందజేశారు. ● ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే రహదారుల అభివృద్ధికి సహకరించాలని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేశారు.

కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన


సూదికొండ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

పలాస, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గాను అవసరమైన స్థలాన్ని శుక్రవారం తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి సిబ్బందితో కలిసి పరిశీలించారు. సూదికొండ దిగువన 15 ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలం ఉండడం, దీనిలో ఎక్కువగా పట్టాలు మార్పిడి చేసి ఆక్రమణలకు గురైంది. సదరు స్థలాలను గుర్తించి ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని తహసీల్దార్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యాల యానికి 12 ఎకరాల భూమి అవసరం ఉందని, సూదికొండ కింద ఉన్న స్థలాలను ప్రస్తుతం గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తులు పునాదులు వేశారని, వారిని గుర్తిస్తామన్నారు. ఇక్కడి స్థలాల్లో ఎవరికీ పట్టాలివ్వలేదని, గతంలో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు 25 సెంట్లు స్థలం మాత్రమే ఇచ్చామన్నారు. అయితే ఆ ప్రాంతంలో లేఅవుట్ మాదిరిగా పునాదులు వేశారని, వీటిని తొలగిస్తామని, అవసరమైతే ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులకు సిఫారసు చేస్తామన్నారు.

విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు

టెక్కలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు పరిశీలించారు. వైద్యులు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సత్యసాయి, వాసుకిరణ్, పీహెచ్‌సీ వైద్యులు ఇంద్రజ, భవిత విద్యా కేంద్రం టీచర్ మన్మథరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్ల కైమాతో సరిపెట్టేశారు

● ఇదీ పెద్దమడి గురుకులం తీరు


విద్యార్థులకు అందించిన గుడ్ల కైమా

మెళియాపుట్టి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలకు కూరగాయలను టెండర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే వారినికి ఒకసారి మాత్రమే సరఫరా చేస్తుండడంతో కూరగాయలు కుళ్లిపోతున్నాయి. దీంతో వాటినే వండి విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. శుక్రవారం పెద్దమడి గురుకుల పాఠశాలలో 350 మంది విద్యార్థులకు కూర లేకుండా భోజనం పెట్టడం కనిపించింది. కూరగాయాలు సరిగా ఇవ్వకపోవడంతో మధ్యాహ్నం గుడ్ల కైమా పెట్టడం కనిపించింది. వాస్తవానికి ఉడగ పెట్టిన గుడ్డుతో పాటు కూరగాయల కూర పెట్టాల్సి ఉన్నా గుడ్ల కైమాతో సర్దుబాటు చేయడం కనిపించింది. అయితే ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కూర గాయాల టెండర్లపై కథనం రావడంతో ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి సమీక్షించి స్పష్టమైన ఆదేశాలిచ్చినా క్షేత్రస్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఘనంగా వేప, రావి చెట్టుకు కల్యాణం


రావి-వేప చెట్టుకు కల్యాణం దృశ్యం

నరసన్నపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విశ్వమానవ కల్యాణార్థం కోమర్తి గ్రామంలో వేప, రావి చెట్టుకు శుక్రవారం కల్యాణం నిర్వహించారు. అర్చకుడు అనంత శర్మ ఆధ్వర్యంలో కింజరాపు రాజారావు, లొట్టి రవి దంపతులు ఈ కల్యాణం చేపట్టారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే జమ్ము గ్రామంలోని శ్రీరామ మందిర ప్రాంగణంలో మాస శివరాత్రి సందర్భంగా సామూహిక రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం కార్తీక సమారాధన చేపట్టారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

5న ప్రతిభ పరీక్ష

జలుమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా గీతా సత్సంగం ఆధ్వర్యంలో డిసెంబరు 5న శ్రీముఖలింగం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం మీనకేతన్ దాసు తెలిపారు. విజేతలకు బహుమతులు అందించున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు 'ఉపాధి' ప్రజావేదిక

మందస, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, వేతనదారులు, అధికారులు హాజరుకావాలన్నారు.

సభ్యత్వాలను ముమ్మరం చేయాలి

వజ్రపుకొత్తూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న నీటిసంఘాల ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు గెలిపించేలా ఓటర్లలో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మండల ప్రధానకార్యదర్శి కర్ని రమణ, కణతి సురేష్, ఎ.ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి అచ్చెన్న పర్యటన

సంతబొమ్మాళి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంతబొమ్మాళి మండలంలో శనివారం పర్యటించనున్నారని ఆయన కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. లక్కివలసలో ఉదయం 9 గంటలకు పింఛన్ల పంపిణీలో పాల్గొంటారని, అనంతరం బోరుభద్ర-మేఘవరం రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు. కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు ఆర్టీసీ బస్సులు ప్రారంభం

టెక్కలి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టెక్కలి డిపో పరిధిలో విశాఖ నుంచి ఇచ్ఛాపురానికి ఆరు, టెక్కలి-విశాఖపట్నం ఒక ఆర్టీసీ సర్వీసులను శనివారం ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు సంతబొమ్మాళి మండలం బోరుభద్ర జంక్షన్‌లో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ సర్వీసులను ప్రారంభిస్తారన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

జి.సిగడాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం గేదెలపేట, సంతవురిటి రైస్ మిల్లులను జేసీ ఆకస్మి కంగా తనిఖీ చేశారు. రైతులు తెచ్చిన ధాన్యానికి కోత్రీలు వేయకుండా కొనుగోలు చేయాలని మిల్లు యజమానికి సూచించారు. తుఫాన్ కారణంగా ఆరుబయట ధాన్యం నిలువ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకొనేలా రైతులను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఏవో ఎర్రా శారద తదితరులున్నారు.

అప్పటి ఎస్‌బీఐ ఆర్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గార ఎస్‌బీఐలో గతేడాది ఖాతాదారులు కుదువ పెట్టిన బంగారు ఆభరణాలు మాయం కేసులో అప్పటి ఆర్‌ఎం టీఆర్‌ఎం రాజుపై చర్యలు తీసుకోవాలని ఉరిటి సరళ సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు పెద్దపాడులో ఉన్న ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయంలో ఆర్‌ఎంకు తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లాకర్‌లో నగలు మాయం కేసులో నిందితులను తప్పించి తన కుమార్తె స్వప్న ప్రియను బాధితురాలిగా చేస్తూ ఆర్‌ఎం పథకం ప్రకారం ఇరికించారని ఆరోపించారు. దీంతో మన స్తాపానికి గురై తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని, ఇందుకు అప్పటి ఆర్‌ఎం రాజు ప్రధాన కారణమన్నారు. అనంతరం రీజనల్ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యులతో నిరసన వ్యక్తం చేశారు.